క్లుప్తంగా

రేపు లక్ష్మీనరసింహ స్వామి ఉత్సవాలు

కల్వకుర్తిరూరల్: మండలంలోని కురుమిద్దెలో లక్ష్మీ నరసింహ స్వామి ఉత్సవాలు బుధవారం నుంచి నిర్వహిస్తునట్లు ఆలయ చైర్మన్ కృష్ణారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమాలు ఆరంభం అవుతాయని పేర్కొన్నారు. 9 గంటలకు బొడ్రాయికి అభిషేకం, అనంతరం 11.30 గంటలకు లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవం, సాయంత్రం బోనాల ఊరేగింపు ఉంటుందని వివరించారు.

గెస్ట్ లెక్చరర్లను రెన్యూవల్ చేయాలి

కల్వకుర్తిరూరల్: ఇంటర్ తరగతులు ప్రారంభమయ్యే వరకు గెస్ట్ లెక్చరర్‌లను రెన్యూవల్ చేయాలని ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సదానందంగౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో 405 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 10 సంవత్సరాలుగా 1654 మంది గెస్ట్ లెక్చరర్‌లు పనిచేస్తున్నారన్నారు. వారందరిని జూన్ 1వ తేదీ నుంచి విధుల్లోకి తీసుకోవాలని ఇంటర్‌బోర్డ్‌కు ఆయన విజ్ఞప్తి చేశారు.

తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ



చారకొండ: తాగునీటిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని ఆర్‌డబ్ల్యూఎస్ డిప్యూటీ ఈఈ విజయ్‌కుమార్ అన్నారు. మండలంలోని అగ్రహారం తండాలో సోమవారం ఆయన ఓవర్‌హెడ్ ట్యాంకును పరిశీలించి, పారిశుద్ధ్య కార్మికులతో ట్యాంకును శుభ్రపరిచారు. అనంతరం టెక్నీషియన్లతో వాటర్ క్లోరినేషన్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఈఈ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు విధిగా నెలలో రెండు సార్లు ట్యాంకును శుభ్రపరచాలని సూచించారు. నీరు వృథా కాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయన వెంట ఎంపీఓ వెంకటేష్, ఆర్‌డబ్ల్యూఎస్ రితిష్, పంచాయతీ కార్యదర్శి నజీమ్‌సుల్తానా తదితరులు ఉన్నారు.

నష్టపరిహారం ఇవ్వాలి



నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లా వ్యాప్తంగా గాలి వాన బీభత్సవంలో మృతిచెందిన బాధిత కుటుంబాలను నష్టపరిహారం ఇవ్వాలని ఉమ్మడి పాలమూరు జిల్లా జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు కాళ్ల నిరంజన్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కుంభం మల్లేష్‌గౌడ్‌లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా బీభత్సంలో గాయపడిన కుటుంబాలను వెంటనే ఆదుకోవాలన్నారు. మృతిచెందిన కుటుంబాలలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని కోరారు. ఒక్కో కుటుంబానికి రూ.20 లక్షల ఆర్థికసాయం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కొట్ర శ్రీనివాసులు, నిరంజన్‌యాదవ్, రవిందర్‌గౌడ్, వెంకటేశ్వర్లు, సుధాకర్‌గౌడ్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత కంటి వైద్యశిబిరం

వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆప్తలమిక్ అసిస్టెంట్ మురళీ తెలిపారు. మండలంలోని ప్రజలు శిబిరంలో పాల్గొని కంటి పరీక్షలు చేయించుకోవాలని, అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామని తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చే వారు తమ ఆధార్‌కార్డును తీసుకుని రావాలని ఆయన కోరారు.

మొక్కలను సిద్ధం చేయాలి

పాన్‌గల్: వర్షాకాలం సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో గ్రామానికి నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా నర్సరీల్లో మొక్కలను సిద్ధం చేయాలని ఎంపీడీఓ కోటేశ్వర్ సూచించారు. సోమవారం మండలంలోని దావాజిపల్లిలో నర్సరీని సందర్శించి మొక్కలను పరిశీలించారు. క్రమం తప్పకుండా వాటర్ క్యూరింగ్ చేయాలన్నారు. నర్సరీలల్లో ఏఏ మొక్కలు ఉన్నాయా అనే విషయాలపై ఉపాధి సిబ్బందితో ఆరా తీశారు. అనంతరం కొత్తపేటలో సాగునీటి కాల్వలో నిర్వహిస్తున్న మరమ్మతు పనులను పరిశీలించారు.

రైతన్న అవస్థలు



జనుంపల్లిలో వడ్లను నించుతున్న రైతులు (ఫైల్)

- కేంద్రాల్లో కానరాని సౌకర్యాలు
- ఇబ్బందులు పడుతున్న అన్నదాతలు

కోడేరు: ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని విక్రయించేందుకు రైతన్నలు నానా అవస్థలు పడుతున్నారు. రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా గ్రామాల్లోనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. కాని కేంద్రాల్లో కనీస వసతులు ఏర్పాటు చేయడంతో నిర్లక్ష్యం వహిస్తోంది. దీంతో ఇటీవల కురిసిన అకాల వర్షాలతో కేంద్రాల్లో ధాన్యం తడిసింది. రైతుల కళ్లెదుటే ధాన్యంరాశులు తడవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పంటల దిగుబడి సమయంలో అన్నదాతలు తిప్పలు తప్పడం లేదు. పండించిన పంటలను అమ్ముకోవటానికి అగచాట్లు పడుతున్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో అసౌకర్యాలు వెంటాడుతుండటంతో రైతుల కష్టాలు అంతఇంతా కాదు. అనేక రకాలుగా ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలో ఇలా..

మండలంలో 22 గ్రామ పంచాయతీలకుగాను 17 కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఇందులో ఐకేపీ ఆధ్వర్యంలో 16 వరి కొనుగోలు కేంద్రాలు సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఒక కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 685 రైతుల నుంచి 3,728.32 మెట్రిక్‌టన్నుల ధాన్యాన్ని అధికారులు సేకరించారు.

ధాన్యం ఆరబెట్టేందుకు ఇబ్బందులు

రైతులు తమ పంటలను కొనుగోలు కేంద్రాల్లో అమ్ముకోవడానికి వెళ్తే అక్కడ అసౌకర్యాలతో అవస్థలు పడుతున్నారు. ధాన్యాన్ని ఆరపెట్టడానికి ప్లాట్ ఫాంలు లేవు. ప్రస్తుతం వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడం అడపదడప వర్షాల కారణంగా పొలాల నుంచి నేరుగా కేంద్రానికే తరలిస్తున్నారు. దీంతో కేంద్రాల వద్ద కనీస సౌకార్యాలు లేక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్రాల్లో సిమెంట్ ప్లాట్ ఫారాలు లేక ధాన్యాన్ని మట్టిపైనే పోయాల్సిన దుస్థితి నెలకొంది. దీంతో రైతులు కిరాయికి పరదాలను తీసుకొచ్చి ధాన్యాన్ని అందులో పోస్తూ ఆరపెట్టుకుంటున్నారు. చలితో పాటు వర్షాలు పడుతుండటంతో ధాన్యం ఆరక తేమ రాక పోవడంతో రోజుల తరబడి కేంద్రాల్లోనే ఉండాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

సరిపడ టార్పాలిన్లు లేక..

కొనుగోలు కేంద్రాల్లో టార్పాలిన్లు అందుబాటులో లేకపోవడంతో రైతులపై అదనపు భారం పడుతోంది. ధాన్యం ఆరబెట్టడానికి టార్పాలిన్లు అద్దెకు తీసుకోవాల్సిన పరిస్థితి. రోజుల తరబడి కిరాయి చెల్లించలేక ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి వరి కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించి టార్పాలిన్లను అందుబాటులో ఉంచాలని రైతులు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి..



కొనుగోలు కేంద్రాలల్లో సౌకర్యాలు కల్పించాలి. వడ్లు ఆరబెట్టేందుకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి. కేంద్రాల్లో తాగునీటి వసతి కల్పించాలి. కేంద్రాలకు తీసుకొచ్చిన వడ్లకు రక్షణ లేకుండా పోతుంది. ప్రభుత్వం స్పందించి వరి కొనుగోలు కేంద్రాల దగ్గర అన్ని వసతులు ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలి.

– మోడిమాకుల శేఖర్, బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు, కోడేరు

మౌలిక వసతులు కల్పిస్తున్నాం..

మండలంలో వరి కొనుగోలు కేంద్రాల దగ్గర అన్ని వసతులు ఏర్పాటు చేస్తున్నాం. మండలానికి 95 టార్పాలిన్లు కవర్లు ప్రభుత్వం పంపిణీ చేసింది. కవర్లను రైతులకు ఇచ్చాం. తాగునీటి వసతి, రాత్రివేళలో కేంద్రాల దగ్గర విద్యుత్‌ను కూడా ఏర్పాటు చేశాం. రైతులు ఇబ్బందులు పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం.

– పార్వతమ్మ, ఏపీఎం, కోడేరు

సమస్యల పరిష్కారానికి కృషి



లక్నారంలో నర్సరీలోని మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ కృష్ణయ్య

తెలకపల్లి: గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంపీడీఓ కృష్ణయ్య అన్నారు. సోమవారం మండలంలోని లక్నారం, గోలగుండం, గౌరెడ్డిపల్లిలో ఆయన సందర్శించారు. లక్నారంలో నర్సరీని పరిశీలించారు. నర్సరీ నిర్వాహకులకు పలు సూచినలు సలహాలు ఇచ్చారు. అనంతరం గౌరెడ్డిపల్లి, గోలగుండం గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలని పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, వీధిలైట్లు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. అదేవిధంగా విద్యుత్ సమస్యను పరిష్కరించాలని అధికారులకు లేఖ రాసినట్లు ఆయన పేర్కొన్నారు. ఏపీఓ మల్లేష్, పంచాయతీ కార్యదర్శులు, పలువురు పాల్గొన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీఓ

నర్సరీలో కలుపు తొలగించాలి..

చారకొండ: నర్సరీలో కలుపును తొలగించాలని ఎంపీఓ వెంకటేష్ అన్నారు. మండలంలోని గ్రహారం తండాలో సోమవారం పర్యటించి అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. నర్సరీలో మొక్కల పెరుగుదల, వాటి సంరక్షణ చర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలో పర్యటించి పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడారు. గ్రామంలో తడి, పొడి చెత్తను విడివిడిగా సేకరించాలన్నారు. గ్రామ పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. ఆయన వెంట నజీమ్ సుల్తానా తదితరులు ఉన్నారు.

తొలి ప్రధాని నెహ్రూకు నివాళి

కొల్లాపూర్: తొలి ప్రధాని నెహ్రూ వర్ధంతి సందర్భంగా సోమవారం టీపీసీసీ నాయకుడు రంగినేని జగదీశ్వరుడు నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీవాణి విద్యానిలయంలో పేదలకు పండ్లు, బ్రెడ్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా జగదీశ్వరుడు మాట్లాడుతూ వ్యవసాయ, పారిశ్రామిక రంగాల్లో నెహ్రూ విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని కొనియాడారు. కార్యక్రమంలో న్యాయవాది మధుసూధన్‌రావు, నాయకులు జమీల్ అహ్మద్‌ఖాన్, వెంకటస్వామి, జావీద్, జుబేర్ తదితరులున్నారు.



పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేస్తున్న జగదీశ్వరుడు

కలెక్టరేట్ ఎదుట ఆందోళన

నాగర్‌కర్నూల్‌రూరల్: జిల్లాలో ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకుడు పి నర్సింహ మాట్లాడుతూ అదేవిదంగా పని ప్రదేశంలో తాగునీరు, టెంట్‌లు, మెడికల్ కిట్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఒక్కో కూలీకి 200 పనిదినాలు కల్పించాలని దినసరి కూలి రూ.600 ఇవ్వాలని, ప్రతి ఒక్కరికి జాబ్‌కార్డు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కందికొండ గీత, డీవైఎఫ్‌ఐ జిల్లా నాయకులు శివశంకర్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు చింత ఆంజనేయులు, భాస్కర్, శంకర్‌నాయక్, కిరణ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఉపాధి కూలీలు

బాధిత కుటుంబాలను ఆదుకోవాలని ధర్నా



ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ఈదురు గాలులు, అకాల వర్షాలతో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ఆదుకోవాలని సీపీఎం, బీఎస్పీ ఆధ్వర్యంలో స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కందికొండ గీత, దేశ నాయక్లు మాట్లాడుతూ అకాల వర్షాలతో దాదాపు 7 మంది ప్రాణాలు కోల్పోయరన్నారు. ఒక్కొక్కరికి రూ.20 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాంచందర్, రామకృష్ణ, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

వెల్దండ: మండలంలోని చెర్కూర్‌లో ఇటీవల గడియ రాములు అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం గ్రామంలోని గంగపుత్ర యువసేన సభ్యులు బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ.37,500లు ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా మండలంలోని కంటోనిపల్లి గ్రామానికి చెందిన మల్లేష్‌గౌడ్ ఇటీవల మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని గౌడ సంఘం నాయకులు పరామర్శించి రూ.17,500లు ఆర్థికసాయం అందజేశారు.

స్నేహితుడి కుటుంబానికి..



వెల్దండ: మండలంలోని కంటోనిపల్లి గ్రామానికి చెందిన కేశనమోని మల్లేష్‌గౌడ్ ఇటీవల మృతి చెందాడు. సోమవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–2003వ సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు వ్యక్తిగతంగా చందాలు వేసుకొని రూ. 32వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మీ, సైదమ్మ, లక్ష్మణ్ స్వామి, అమర్‌నాథ్‌యాదవ్, ఖాజా, శ్రీశైలం గౌడ్, మధు, దినేష్, వెంకటేష్, రాజు, నాగరాజు తదితరులు ఉన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెల్దండ: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. ఎస్‌ఐ రవి వివరాల ప్రకారం మండలంలోని పెద్దాపూర్ గేట్ వద్ద ఆదివారం రాత్రి ట్రాక్టర్, కారు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ పులి రమేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడిని చికిత్స నిమిత్తం మండలంలోని యెన్నమ్స్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. కల్వకుర్తి ప్రభుత్వ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహంను కుటుంబ సభ్యులకు అప్పగించారు. మృతుని భార్య యాదమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతునికి భార్య యాదమ్మతో పాటు ముగ్గురు పిల్లలు ఉన్నారు.

సారా విక్రయించొద్దు



కల్వకుర్తిరూరల్: సారా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎక్సైజ్ సీఐ జిల్లెల్ల వెంకట్‌రెడ్డి హెచ్చరించారు. సోమవారం సర్కిల్ పరిధిలో వాహనంపై తరలిస్తున్న 4 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. వాహనం సీజ్ చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా మహబూబ్‌నగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం చారకొండ ప్రాంతంలో నిర్వహించిన సోదాలలో 60 లీటర్ల సారా స్వాధీనం చేసుకొని 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి రెండు కేసులు నమోదు చేసి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నామని ఆయన తెలిపారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ శారద, కల్వకుర్తి ఎస్‌ఐ సృజల్ పాల్గొన్నారు.

అందుబాటులో జీలుగ విత్తనాలు

లింగాల: భూసారం పెంపునకు దోహదపడే జీలుగ విత్తనాలు సబ్సిడీపై అందుబాటులో ఉన్నాయని ఏఓ నాగార్జునరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సింగిల్ విండో కార్యాలయం ఆవరణలో పలువురు రైతులకు జీలుగ విత్తనాలను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ వానా కాలం సీజన్ ప్రారంభం కావడానికి నెల రోజుల వ్యవధి ఉందని అంతకు ముందే పొలంలో జీలుగ విత్తనాలను వేసి పెంచాలని, ఏపుగా పెరిగిన తర్వాత పొలంలో కలియదున్నాలని, దీని వలన భూసారం పెరుగుతుందన్నారు. 60 శాతం సబ్సిడీపై 30 కిలోల బ్యాగ్ రూ. 1,116లకు విక్రయిస్తునట్లు వివరించారు. కార్యక్రమంలో ఏఈఓ సురేంద్రరెడ్డి, సీఈఓ పాండు, రైతులు పాల్గొన్నారు.



లింగాలలో రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏఓ నాగార్జునరెడ్డి

ముమ్మరంగా ఉపాధి పనులు

పెద్దకొత్తపల్లి: మండలంలోని 25 గ్రామ పంచాయతీలలో జాతీయ ఉపాధిహామీ పథకం పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. సోమవారం చెరువు, కుంటలలో ఒండ్రు మట్టి తరలింపు, ఎంఐ ట్యాంక్‌ల నిర్మాణ పనులు చేశారు. ఆయా గ్రామాల్లో కొత్తగా ఉపాధి పనుల కోసం వచ్చే కూలీలకు జాబ్‌కార్డులను ఫీల్డ్ అసిస్టెంట్‌ల వద్ద పొందాలని ఎంపీడీఓ నాగేందర్ సూచించారు. అన్ని గ్రామాలలో కూలీలందరికి పనులు కల్పించాలని ఆయన పేర్కొన్నారు.



చిన్నకార్పాములలో ఎంఐ ట్యాంక్ నిర్మాణం పనులు చేస్తున్న కూలీలు

కూలీలు సద్వినియోగం చేసుకోవాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

లింగాల: గ్రామాల్లో ముమ్మరంగా కొనసాగుతున్న జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ ఆంజనేయులు కూలీలను కోరారు. సోమవారం మండలంలోని రాయవరంలో పనులను ఆయన పరిశీలించారు. వ్యవసాయ భూములు చదును చేయడం, రోడ్డు ఫార్మేషన్ పనులు కొనసాగుతున్నాయని ఎంపీడీఓ తెలిపారు. పనులలో పారదర్శకత ఉండేలా చూడాలని ఉపాధి సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ ఇమాంఅలీ, టీఏ పాల్గొన్నారు.

స్తంభించిన జన జీవనం



మేడిపూర్‌లో అంతర్గత రోడ్డుపై విరిగిన చెట్లు



బలాన్‌పల్లిలో విద్యుత్ తీగలపై పడిన చెట్టు

తాడూరు: ఈదురుగాలులకు పలు గ్రామాల ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఆదివారం వీచిన బలమైన గాలులతో జనజీవనం స్తంభించింది. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడింది. రోడ్లపై చెట్లు విరిగిపడటంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. మేడిపూర్‌లో ప్రధాన అంతర్గత రోడ్లకు ఇరువైపుల ఉన్న చెట్లు విరిగిపడ్డాయి. పాఠశాల ఆవరణలో ఉన్న చెట్లు విరిగి ప్రహరీ కూలింది. బలాన్‌పల్లి, ఇంద్రకల్, యాదిరెడ్డిపల్లి గ్రామాల్లో చెట్లు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిపివేశారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఏఓ, ఎస్‌ఐ



మన్ననూరులో..

ఉప్పునుంతల: రైతులకు నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించొద్దని ఎవరైన నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని ఏఓ సునీత, ఎస్‌ఐ లెనిన్ హెచ్చరించారు. సోమవారం వ్యవసాయ, పోలీస్‌శాఖల ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని విత్తన, పురుగుమందుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. విత్తనాల స్టాక్ రిజిస్టర్లు, విత్తనాల పాకెట్లపై లెబుల్స్ తదితర అంశాలను వారు పరిశీలించారు. గోదాంలలో స్టాక్‌చేసిన విత్తన నిల్వలను తనిఖీ చేశారు. డీలర్లకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

మన్ననూర్: స్థానిక రైతువేదికలో అమ్రాబాద్ మండలంలోని విత్తన డీలర్లతో నిర్వహించిన సమావేశంలో ఏఓ సందీప్ మాట్లాడారు. ఎవరైన అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎస్‌ఐ రమేష్, విత్తన డీలర్లు అందరు పాల్గొన్నారు.

ఉప్పునుంతల: నకిలీ విత్తనాలపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏఈఓ భరత్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని వెల్టూరులో రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. లైసెన్స్‌పొందిన డీలర్ వద్ద ప్రభుత్వం నుంచి ధ్రువీకరించన కంపెనీలకు చెందిన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతులు లింగమయ్య, శ్రీశైలం, జంగిరెడ్డి, బంగారయ్య, బుచ్చలు, కృష్ణయ్య, బాలస్వామి, సైదులు, లాలు తదతరుల పాల్గొన్నారు.

పెద్దకొత్తపల్లి: ఎరువుల దుకాణాలలో ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు రషీదులు పొందాలని ప్యారలీగల్ వలంటర్ శ్రీనివాసులు అన్నారు. దేవినేనిపల్లిలో ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల కొనుగోలుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కరుణాకర్, లక్ష్మయ్య, నాగయ్య, మల్లేష్, కృష్ణయ్య పాల్గొన్నారు.


చారకొండ: మండల కేంద్రంలో రైతులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మండల వ్యవసాయ అధికారి చిన్న హుసేన్, ఏఈఓ రేణుకా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. అదేవిధంగా మండలంలోని గ్రామాల్లో రెవెన్యూ క్లస్టర్లలో జూపల్లి గ్రామంలో ఏఈఓ సుష్మ, సారంబండ తండాలో ఏఈఓ అనూష, రామచంద్రాపురంలో ఏఈఓ వంశీ రైతులతో సమావేశం అయ్యారు. విత్తనాలు, ఎరువులపై అవగాహన కల్పించారు.

బిజినేపల్లి: మండలంలోని బోయాపూర్‌లో ఏఈవో శారద, లట్టుపల్లిలో ఏఈఓ అఖిల్‌కుమార్‌లు రైతులతో సమావేశం అయ్యారు.

లింగాల: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఫర్టిలైజర్స్ డీలర్లలో ఏఓ నాగార్జునరెడ్డి, ఎస్‌ఐ జగన్మోహన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీలర్లకు విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందుల విక్రయాలపై పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. సమావేశంలో ఏఈఓ సురేంద్రరెడ్డి, మండలంలోని ఆయా గ్రామాల ఫెర్టిలైజర్ దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్‌రూరల్: నాణ్యమైన విత్తనాలనే విక్రయించాలని డివిజన్ సహాయ సంచాలకులు రమేష్‌బాబు అన్నారు. సోమవారం మండలంలోని ఎరువులు, పురుగు మందుల డీలర్లకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. ప్రధానంగా పత్తి విత్తనాల అమ్మకాల్లో పాటించాల్సిన అంశాలను వివరించారు. ఏఓ నర్మద పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ



వెంకటయ్య కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి: బాధితులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి కోరారు. సోమవారం తిమ్మాజిపేట మండలంలోని మారేపల్లి గ్రామానికి చెందిన రైతు కుమ్మరి వెంకటయ్య పిడుగుపాటుకు మరణించాడు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే మర్రి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థికసాయం అందజేశారు. అదేవిధంగా మారేపల్లి కాలనీ సమీపంలో గాలివానకు నేలకు కూలిన కోళ్లఫారంను, ఇంటి పైకప్పులు లేచిపోయిన బాధితులను కలిసి ఓదార్చారు. బాధితులకు తక్షణమే సాయం చేయాలని అధికారులను కోరారు. జరిగిన నష్టాన్ని అంచనా వేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ప్రదీప్, ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి, నాయకులు వెంకటస్వామి, ఆయూబ్‌ఖాన్, గోపిగౌడు, రాజేందర్‌రెడ్డి, పరందాములు, తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని బద్నాం చేస్తే ఊరుకోం..

చిన్నంబావి: మండలంలోని లక్ష్మీపల్లికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్య ఘటనపై మంత్రి జూపల్లిని బద్నాం చేస్తే ఊరుకునేది లేదని కాంగ్రెస్ నాయకులు రామచంద్రరెడ్డి అన్నారు. మండలంలోని పెద్దదగడలో పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు కృష్ణాప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ శ్రీధర్ రెడ్డి హత్యలో తనను అకారణంగా నిందిస్తున్నారని, ఆయనను నేను హత్య చేయించడానికి గల కారణాలను తెలపాలని బీఆర్‌ఎస్ నాయకులను ప్రశ్నించారు. తాను 2006 నుంచి జెడ్పీటీసీగా, ఎంపీపీగా సేవలందిస్తున్నాని మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి రాజకీయాల్లో లేని సమయంలోనే నేను ఉన్నత పదవులలో ఉన్నానని, అటువంటిది శ్రీధర్ రెడ్డి హత్యలో ప్రమేయం ఉందనడం హస్యాస్పదం అన్నారు.

'ఆరోపణలు చేయడం సరికాదు'

వీపనగండ్ల: చిన్నంబావి మండలంలో బీఆర్‌ఎస్ నాయకుడు శ్రీధర్‌రెడ్డి హత్య విషయంలో నిజనిర్ధారణ కాకుండా మంత్రి జూపల్లి ప్రమేయం ఉందని ఆరోపించడం అవివేకమైన చర్య అని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీరయ్య యాదవ్, నారాయణ రెడ్డి, కృష్ణయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. హత్య జరిగిన కొన్ని గంటల్లోనే ఘటనా స్థలానికి చేరుకున్న కేటీఆర్ మంత్రిపై కక్ష పూరితంగా ఆరోపణలు చేశారని, గతంలో ఇలాంటి ఘటనలో అసత్య ఆరోపణలు చేశారని అన్నారు. 25ఏళ్ల జూపల్లి రాజకీయ చరిత్రలో ఇలాంటి ఘటనలను ఎప్పుడూ సమర్థించలేదని ప్రజాక్షేత్రంలో గెలువలేనివారు దురుద్దేశపూర్వకంగా మంత్రిని బద్నాం చేయాలని చూస్తున్నారని వారు అన్నారు.